RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 83 | ఫిబ్రవరి 16, 2025 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ.. నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379

# హోంగార్డుల వేతన వెతలు





- ఫస్ట్ తారీకు జీతం ఉత్త మాటేనా?
- ప్రతిపక్షంలో ముద్దోచ్చాము.. అధికారంలోకి వచ్చాక కక్కొచ్చామా..?
- ఇంటి అద్దెలు చెల్లించలేక బజార్లో అవమాన పాలవుతున్నాము..
- సోషల్ మీడియా వేదికగా హోంగార్డుల ఆవేదన..!
- ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని వేడుకోలు

**వేద న్యూస్, హైదారాబాద్ :**

సభలు..సమావేశాలు..మరే ఇతర కార్యక్రమంలోనైనా ప్రజలు, నాయకులకు వారు రక్షణగా ఉంటారు. కానీ, వారి జీవితాలకు మాత్రం తగిన రక్షణ లేకుండాపోతున్నది..! పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్ప టికీ వారికి తగిన గౌరవం దక్కడం లేదు..! వారే హోంగా ర్డులు.. వారికి సకాలంలో వేతనాలు, అలవెన్స్‌లు అందక ఇబ్బందులు పడుతూ తమ ఆవేదనను సోషల్ మీడియా ఈ విధంగా పంచుకున్నారు.

రాష్ట్ర సర్కారు మాటలు కోటలు దాటుతున్నాయని, ఆచరణలో మాత్రం అసలు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని., ప్రజా ప్రభుత్వంలో ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని చెబుతున్న మాటలు వట్టివేనని హోంగార్డులు ఆరోపిస్తున్నారు.

'మా మొర ఆలకించేది ఎవరు..?మాకు న్యాయం చేసేది ఎవరు..? ప్రభుత్వాలు మారినా మా బ్రతుకులు మారడం లేదు.. ఆశతో ఓటేస్తే నిరాశే మిగిల్చారు.. ప్రశ్నిద్దాం అంటే క్రమశిక్షణ చర్యలు.. ఎదురిద్దామంటే ఆదిలోనే ఆంక్షలు.. ఖాకీ బట్టల కబందా హస్తాల్లో నలిగిపోతున్నాము ' అని పేర్కొంటున్నారు.

'తాము ప్రతిపక్షంలో ముద్దోచ్చాము అని, అధికారంలోకి వచ్చాక కక్కొచ్చామా..? ఏదీ ఆనాటి మద్దతు ఏది ఆనాటి పలకరింపు..సంవత్సర కాలంలోనే మా ఆశలను సమాధి చేశారు..మమ్ములను కూడా మనుషులుగా గుర్తించి ఒక గౌరవాన్ని ఇవ్వండి సారు.. ఖాకీ కులం ఒకటైనప్పుడు మాకెందుకు సారు ఈ సమస్యలు.. ఒకరి పై కన్నతల్లి ప్రేమ ఒకటో తారీకు వేతనాలు. మరొకరిపై సవితి తల్లి ప్రేమ నెల15 రోజులు గడిచినా ఇవ్వరు...తేడా ఏంది సారు అర్థం కావడం లేదయ్యా..సంక్షేమం కాడ వివక్ష..జీతాల కాడ వివక్ష.. ఆటల కాడ వివక్ష..పదవి విరమణ కాడ వివక్ష.. ఆఖరికి మేము చచ్చిపోతే మా శవాల కాడ కూడా వివక్ష ఎందుకయ్యా మాకు ఇంత అన్యాయం..మా పిల్లలను చదివిపించలేకపోతున్నాము సారు..మా తల్లి దండ్రులను పోషించలేకపోతున్నాము.. మేము అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాము.. హెల్త్ కార్డు ఇంకా ఇయ్యలేదు.. ఇంటి అద్దెలు చెల్లించలేక బజార్లో అవమాన పాలవుతున్నాము..బ్యాంకు లోన్లు సమయానికి చెల్లించలేక అదనపు వడ్డీలు చెల్లిస్తున్నాము అయ్యా ఆలోచించండి మీరిచ్చే జీతం మాకు సరిపోవడం లేదు..చనిపోయిన హోంగార్డుల పిల్లలు అనాథలుగా జీవిస్తున్నారు జర ఆదుకోండి సారు.. కారుణ్య నియామకాలు అమలు చేయండి సారు..బాంచన్ జర దండం పెడతాం' అని సీఎం రేవంత్ రెడ్డిని సోషల్ మీడియా వేదికగా వేడుకుంటున్న పోస్టు చక్కర్లు కొడుతున్నాయి.



## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

### డిఎంహెచ్వో బి.సాంబశివరావు

**వేద న్యూస్, వరంగల్ :**

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని వాటిని నిర్వహించిన వారి ప్రోత్సహించిన చట్టరీత్యా చర్యలు తీసుకొని అట్టి స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేస్తామని డిఎంహెచ్వో బి.సాంబశివరావు హెచ్చరించారు. శనివారం వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చాంబర్లో పిసిపి ఎన్ డిటి డిస్టిక్ లెవెల్ అడ్వైజరి కమిటీ మీటింగ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు ప్రతీ నెల 5వ తేదీ ఫామ్ ఎఫ్ నివేదికలను సమర్పించాలి అని అన్నారు. స్కానింగ్ కేంద్రాలలో ఎవరైనా రేడియోలోజిస్ట్, గైనకాలజిస్టు మారిన క్రమములో సమాచారం అందించాలని సూచించారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం స్కానింగ్ కేంద్రాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్ , డాక్టర్ మోహన్ సింగ్, డాక్టర్ అర్చన మాత శిశు సంరక్షణ అధికారి, అభ్యుదయ సేవాసమితి అధ్యక్షులు మండల పరిశరాములు, డిపిహెచ్ఎన్ఓ జ్ఞానసుందరి, నాగరాజు పాల్గొన్నారు.



## విద్యార్థులు, తల్లిదండ్రులతో కలెక్టర్ చిట్ చాట్

- విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాలు దిక్సూచిగా నిలుస్తాయి
- కలెక్టర్ డా.సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ :**



విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాలు దిక్సూచిగా నిలుస్తాయని వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద అభిప్రాయపడ్డారు. శనివారం వరంగల్ జిల్లా దేశాయిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యారు ్థలు వారి తల్లిదండ్రులతో నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై వారితో చిట్ చాట్ నిర్వహిం చారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 125 పాఠశాలల్లో శనివారం విద్యార్థి తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహిం చడం జరిగిందని అన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం పాఠశాల పటిష్టతకు విద్యార్థి వికాసానికి సమస్యల పరిష్కారానికి దిక్సూచిగా నిలుస్థాయని అన్నారు. ఇలాంటి సమావేశాలు విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల మధ్య ఆత్మీయ వారధిని నిలుస్తాయని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లల చదువు ప్రవర్తన క్రమశిక్షణ తల్లిదండ్రులు తెలుసుకోవచ్చునని అన్నారు. పిల్లల విద్యా విధాన తీరు పై వారం లో ఒకసారి అయినా సమీక్షించాలని, పిల్లల విద్య సంబంధిత అంశాలపై ఆయా సబ్జెక్టులు బోధించే టీచర్లతో చర్చించాలని కలెక్టర్ అన్నారు. పదవ తరగతి చదివే విద్యార్థులు రానున్న పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు జిల్లా కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణను అవలంబిస్తే విద్య తానంతట అదే వస్తుందని, విద్యార్థులకు ఉపాధ్యాయుల బోధన ఎంత అవసరమో తల్లిదండ్రుల పర్యవేక్షణ కూడా అంతే అవసరమని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు వారి నైపుణ్యాలను వెలికి తీసే కార్యక్రమాలను ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తహసిల్దార్ మహమ్మద్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.



## యుద్ధ ప్రాతిపదికన వాహనాలకు మరమ్మత్తులు చేపట్టాలి

### బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**


యుద్ధప్రాతిపదికన వాహనాలకు మరమ్మత్తులు చేపట్టాలని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు.

హనుమకొండ లోని బాల సముద్రంలోని వాహన షెడ్ ను శనివారం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి మరమ్మతులకు గురైన వాహనాల వివరాల తో పాటు షో రూమ్ లకు తరలించి మరమ్మతులకు చేపట్టపడుతున్న భారీ వాహనాల వివరాలను, ఎప్పుడు మరమ్మత్తులకు పంపించారో తేదితో సహా తెలియజేయాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర ,సిఎంహెచ్ ఓ డా.రాజారెడ్డి, ఈఈ మహేందర్, శానిటరీ సూపర్ వైజర్ నరేందర్, ఏఈ ఫణి, శానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్, స్మార్ట్ సిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి సమగ్ర కులగణన సర్వే

**వేద న్యూస్, డెస్క్:**

సమగ్ర కులగణనలో పాల్గొనని వారి వివరాలను అధికారులు నేటి నుంచి నమోదు చేయనున్నారు. స్వచ్ఛందంగా ముందు కొచ్చిన వారి వివరాలను నమోదు చేసుకోనున్నారు. కులగణన కోసం 040-21111111 టోల్ ఫ్రీ నంబరు అందుబాటులో ఉంటుందని ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చి మరీ సంబంధిత వివరాలను నమోదు చేస్తారని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలకు ఎంపీడీవో కార్యాలయాలు, పట్టణాలు, నగరాల్లో వార్డు, డివిజన్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాలకు వెళ్లి సమగ్ర కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. కార్యాలయాల్లో శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు అందుబాటులో ఉంటారన్నారు. కులగణన సర్వే వెబ్‌సైట్ %https://seeepc survey. cgg.gov.in% నుంచి అప్లికేషన్ ఫారం డౌన్‌లోడ్ చేసుకుని దానిని నింపి ప్రజాపాలన సేవా కేంద్రాల్లో అందజేయవచ్చని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల 56 వేల 323 కుటుంబాల వివరాలు గతంలో జరిగిన కులగణనలో నమోదు కాలేదని ఈ సందర్భంగా సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు.



## ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### కూలీలకు పని ప్రదేశంలో కనీస వసతులు ఏర్పాటు చేయాలి

### ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏపీడి కి వినతిపత్రం

దేవనకొండ : పెండింగ్ లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చాకలి. కృష్ణ,మండల ఉపాధ్యక్షులు సి.బజారి వై.నాగేశ్వరరావు లు డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల సమితి (బికెఎంయూ) ఆధ్వర్యంలో ఉపాధి కూలీల సమస్యలపై ఏపీడి పక్కీరప్ప మరియు ఏపీవో రాజు నాయక్ లకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు వేతనాలు ఇవ్వడంలో పాలక ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. పని ప్రదేశంలో కనీసం వసతులు కల్పించకపోవడం వల్ల ఉపాధి కూలీలు పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచి, 500 రూపాయలు కనీస వేతనం చెల్లించాలన్నారు. గ్రామాలలో వలసల నివారణకు ఉపాధి హామీ పనులు చేసుకుని కుటుంబాలను పోషించుకునే పేద మధ్యతరగతి కుటుంబాలకు చాలీచాలని వేతనాలు ఉండటంవల్ల తమ పిల్ల పాపలతో సుదూర ప్రాంతాలకు వలసలకు వెళ్లే దుస్థితి దాపురించిందన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ పథకం నిర్వీర్యం కాకుండా ఉండాలంటే ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచి, 500 రూపాయలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మరణించిన ఉపాధి కూలీకి 5 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేసియా చెల్లించాలన్నారు. ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు సకాలంలో మంజూరు చేయాలని లేని పక్షంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు భాస్కర్, నరేష్, శంకర్, రఫీ, కోదండ, డేవిడ్, కోదండ రాముదు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరింపుతో ప్రాణాలు భద్రం...

### - ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరండి

బద్వేలు : బద్వేల్ పట్టణంలో అర్బన్ ఎస్సై సత్యనారాయణ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శేఖర్ రావు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు హెల్మెట్ ధరింపుతో ప్రాణాలు సురక్షితమని...ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని బద్వేల్ పట్టణంలోని అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శేఖర్ రావు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాధాన్యత వివరిస్తూ పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్ నుండి పలు ప్రధాన రహదారులలో బైకుల మీద తిరుగుతూ ర్యాలీ నిర్వహించారు, అనంతరం అర్బన్ ఎస్ఐ మాడిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతుండటం మనం చూస్తున్నామన్నారు. ఈ విచార ఘటనల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుండి తమను తాము కాపాడుకోవాలని తెలియజేశారు. దీంతోపాటు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు.ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. ఎం.వి.ఐ శేఖర్ రావు మాట్లాడుతూ హెల్మెట్ ధరించని వారిపై కఠినంగా ఎం వి యాక్ట్ ప్రకారం జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని, హెల్మెట్ ధరించటం ద్వారా మీ భద్రత మరియు మీ కుటుంబం యొక్క ఆనందం గురించి ఆలోచించాలన్నారు.

## అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన ఎస్సి వర్గీకరణ రిపోర్ట్ పూర్తి తప్పుల తడక

మంథని : ఫిబ్రవరి 4వ తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన ఎస్సి వర్గీకరణ రిపోర్ట్ పూర్తి తప్పుల తడక అని మంథని నియోజకవర్గ మాల సంఘం నాయకులు అన్నారు. ఫిబ్రవరి 14వ తేదీని సోషల్ జస్టిస్ బ్లాక్ డే గా ప్రకటిస్తూ మంథని నియోజకవర్గ మాల సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ డా. షేమిమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్ ఆధ్వర్యంలో రూపొందిన ఎస్సి వర్గీకరణ ప్రతులను మంథని పట్టణంలోని అంబేద్కర్ విగ్రహా చేతికి కట్టి అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. సందర్భంగా మాలల ఐక్య వేదిక గౌరవ సలహాదారులు కొవ్వూరి రాజలింగు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాల మాల అనుబంధ కులాలను సామజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పరంగా అణిచివేయడానికి మాత్రమే వర్గీకరణ రిపోర్ట్ తీసుకరావడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ సుప్రీం కోర్టు సూచనలు సలహాలు పట్టించుకోకుండా జన, కుల గణన, ఎంపరికల్ డాటా,శాస్త్రియత లేకుండా ఏక పక్షంగా వర్గీకరణ రిపోర్టు అసెంబ్లీ ప్రవేశ పెట్టడం జరిగిందని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ మాలలకు పూర్తి వ్యతిరేక పార్టీగా మారిందని,కాంగ్రెస్ పార్టీ,పార్టీ పదవుల్లో గానీ, ప్రభుత్వ పదవుల్లో గానీ మాల మాల అనుబంధ కులాలను పట్టించుకోకుండా ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం ఒకే సామాజిక వర్గానికి కొమ్ము కాస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మాల, మాల అనుబంధ కులాలపై తమ వైఖరి మార్చుకొని వెంటనే శాశ్వత పరిష్కారం కోసం ఎస్సి వర్గీకరణ బిల్లును పార్లమెంట్లో ప్రవేశ పెట్టి చట్టం చేసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పై పోరాటం సాగించాలని లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రత్యేక్ష పోరాటంకు సిద్ధమావుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాలలు తగిన బుద్ది చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాలల ఐక్య వేదిక మండల ఉపాధ్యక్షులు బండారి సమ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అప్పాల పోచమల్లయ్య, నియోజకవర్గం ఇంచార్జ్ కొవ్వూరి వేణు ప్రసాద్, బడికెల స్వామి మిగితా నాయకులు పాల్గొన్నారు.

### విమాన రంగంలో గ్రామీణ ప్రాంతాల్లో

## యువతకు ఉద్యోగ అవకాశాలు

హైదరాబాద్ : విమానయాన రంగంలో గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి సచివాలయంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రీజినల్ హెడ్ పి. జగదీశ్వర్‌తో పాటు ఇండిగో ఎయిర్‌లైన్స్‌కి చెందిన తన హెచ్‌ఆర్ బృందంతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.యువతకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి విమానయాన రంగంలో అవకాశాలపై చర్చించారు.యువతకు ఉద్యోగ అవకాశాలపై ఇండిగో ఎయిర్‌లైన్స్ సానుకూల స్పందనను వ్యక్తం చేసింది. వారు త్వరలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించడానికి ఏర్పాటు చేస్తామని తెలిపారు.స్థానిక యువతకు విమానయాన పరిశ్రమలో కెరీర్ అవకాశాలను అన్వేషించే అవకాశాన్ని అందిస్తామన్నారు.

## హోం శాఖకు నిధులు పెంచాలి : హోం మంత్రి అనిత

అమరావతి : సచివాలయంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల అధ్యక్షతన జరిగిన హోం,విపత్తు నిర్వహణ శాఖల ప్రీ-బడ్జెటరీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి న హోం, విపత్తు నిర్వహణశాఖ మంత్రి వంగలపూడి అనిత హజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల రక్షణే ప్రాధాన్యతగా హోంశాఖకు ప్రత్యేకంగా కేటాయింపులు వుంటాయి. కేంద్ర ప్రభుత్వ నిధులు రాబట్టడంపై ప్రత్యేక కసరత్తు చేస్తున్నాం. హోం శాఖకు సంబంధించి 94 కేంద్ర ప్రభుత్వ పథకాలను పక్కనపెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే 73 పథకాలను పునరుద్ధరించాం. కేంద్ర ప్రభుత్వ నిధులను సాధ్యమైనంత తెప్పించి సక్రమంగా వినియోగిండంపై పెద్దపీట వేస్తాం. మానవవనరులు, సౌకర్యాలను వినియోగించుకుని ఖర్చు తగ్గించుకోవడంపైనా దృష్టి పెట్టాలి.పోలీస్ వాహనాలకు ఇంధనం 150 లీటర్ల నుంచి 300 లీటర్లకు పెంచడంపై ప్రతిపాదన చేసామని అన్నారు. గత ఐదేళ్లలో ఇన్వెస్టిగేషన్ ఛార్జ్ లు ఇవ్వలేదు..ఈసారి కేటాయించాలని కోరారు. ఇన్వెస్టిగేషన్ ఛార్జీల అంచనాను పెంచాలని ప్రతిపాదించారు. ఖైదీలు పెరుగుతున్న నేపథ్యంలో కొత్త జైలు భవనాలను నిర్మించడానికి బడ్జెట్ ఇవ్వాలని కోరారు.



# పింక్ బుక్ కామెంట్

మెదక్ : పరీక్షల్లో కాపీ కొట్టడం మనం చూసే ఉంటాం. కానీ పాలిటిక్స్ లో కూడ కాపీయింగ్ మొదలైంది. టీడీపీ అంటే అస్సలు పడని ఓ పార్టీ, ఇప్పుడు టీడీపీ దారిలోనే నడుస్తుందట. ఏపీలో రెడ్ బుక్ అంటుంటే, తెలంగాణలో పింక్ బుక్ ఓపెన్ చేశామని ప్రకటించారు బీఆర్ఎస్ కు చెందిన మహిళా నేత కవిత. తాజాగా కవిత చేసిన కామెంట్స్ కి టీడీపీని బీఆర్ఎస్ కాపీ కొట్టిందంటూ నెటిజన్స్ రెస్పాండ్ అవుతున్నారు.ఏపీలో మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్ర నిర్వహించారు. ఆ పాదయాత్రలో కార్యకర్తలు తమ ఇబ్బందులను లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. తమను అకారణంగా వైసీపీ నాయకులు, అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అప్పుడు పుట్టిందే రెడ్ బుక్.. తమ కార్యకర్తలను చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించి ఇబ్బందులకు గురి చేసిన వారి పేర్లు, తప్పక రెడ్ బుక్ లో ఉంటాయని లోకేష్ చెప్పారు. ఎన్నికలు వచ్చాయి. కూటమి అధికారంలోకి వచ్చింది. రెడ్ బుక్ ఓపెన్ అయినట్లేనని చెప్పవచ్చు. ఎందుకంటే పలువురిని పోలీసులు అరెస్ట్ చేయడం, తాజాగా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని కూడ అరెస్ట్ చేయగా రెడ్ బుక్ ఓపెన్ అంటూ ప్రచారం సాగుతోంది. అయితే లోకేష్ ఓపెన్ చేసిన రెడ్ బుక్ ను చూసి, తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ కూడ కాపీ కొట్టేసిందని చెప్పవచ్చు. ఏపీలో అక్రమ కేసులతో ఇబ్బందులు ఎదుర్కొన్న టీడీపీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు రెడ్ బుక్ ఓపెన్ చేస్తే, తెలంగాణలో మాత్రం అందుకు భిన్నంగా పింక్ బుక్ ఓపెన్ కానుందని ప్రచారం సాగుతోంది. తాజాగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. అధికారం వచ్చాక అందరి సంగతి తేలుస్తాం. పింక్ బుక్ ఓపెన్ చేశామంటూ ప్రకటించారు. టీడీపీ ఓటమి ఖాయమంటూ ఎన్నికల ముందు వరకు బీఆర్ఎస్ ముఖ్య నేతల నోట వినిపించిన మాట వాస్తవమే. అటువంటి పరిస్థితుల్లో టీడీపీ రెడ్ బుక్ ను కాపీ కొట్టి పింక్ బుక్ అంటూ కవిత కామెంట్స్ చేశారని నెటిజన్స్ అంటున్నారు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓ వైపు అభివృద్ధి, మరోవైపు ప్రజా సంక్షేమ పథకాలను సాగిస్తోంది. ఇటీవల దావోస్ పర్యటన వెళ్ళిన సీఎం రేవంత్ రెడ్డి, లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు తీసుకువచ్చారు. ఇలా కాంగ్రెస్ పాలన సాగుతుండగా, బీఆర్ఎస్ సోషల్ మీడియా మాత్రం ఓ రేంజ్ లో విమర్శల పర్వాన్ని సాగిస్తోందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. సాక్షాత్తు మంత్రి సీతక్కను ఉద్దేశించి బీఆర్ఎస్ సోషల్ మీడియా చేసిన ట్రోలింగ్ కి తెలంగాణ సమాజం పూర్తిగా వ్యతిరేకించింది. సీఎం రేవంత్ రెడ్డి కూడ అసెంబ్లీలో ఇదే అంశాన్ని ప్రస్తావించారు. పలుమార్లు బీఆర్ఎస్ సోషల్ మీడియా హద్దులు దాటి ప్రవర్తించగా, చట్టం తనపని తాను చేసుకు పోయింది.లైన్ దాటి మరీ ప్రవర్తిస్తున్న సోషల్ మీడియా టీంను కంట్రోల్ చేయకుండా, కవిత పింక్ బుక్ అంటూ కామెంట్స్ చేయడం ఏమిటని కాంగ్రెస్ అంటోంది. అక్రమ కేసులు ఎక్కడా బనాయించిన దాఖలాలు లేవని, టీడీపీ రెడ్ బుక్ ను చూసి కవిత కాపీ కొట్టారని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు. ఏదిఏమైనా తమ పార్టీ అంటే అస్సలు పడని బీఆర్ఎస్.. తమను కాపీ కొట్టిందని టీడీపీ సోషల్ మీడియా అంటోంది.

# అప్పుడే సెక్రటేరియెట్ లో లీకులా..



హైదరాబాద్ : తెలంగాణ పరిపాలనా యంత్రాంగం మొత్తం కొలువుదీరే రాష్ట్ర సచివాలయం భవనాలు పెచ్చులూడిన ఘటన పై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. సచివాలయం మూడో అంతస్తు నుంచి ఎదురు వైపున ఉండే డిజైన్ లోని ఓ భాగం ఊడిపోయింది. ఆ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి సహా ఇతర మంత్రులు సచివాలయంలోనే ఉన్నారు. ఈ ఘటనలో సెక్రటేరియట్ పార్కింగ్ స్థలంలో ఉంచిన రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ కారుపై పెచ్చులు పడడంతో.. కారు పై భాగం దెబ్బతింది.ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. నిర్మాణం పూర్తయ్యి రెండేళు కూడా పూర్తవకుండానే ఇలాంటి ఘటనలు జరగడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. దాంతో.. రాష్ట్ర ఉన్నతాధికారులు సైతం ఈ ఘటన పై దర్యాప్తు ప్రారంభించారు.దాదాపు రూ.1200 కోట్లతో నిర్మించిన భవనం. దేశంలోనే అత్యంత పేరున్న సంస్థ నిర్మించిందని ప్రచారం. నిర్మాణంలో ఎక్కడా రాజీ పడలేదంటూ ప్రభుత్వాలు ఊదరగొట్టేశాయి. తీరా.. రెండేళ్లు కూడా గడవక ముందే పెచ్చులూడుతూ.. నిర్మాణంలోని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో.. ప్రభుత్వ అధికారులతో పాటు పాలకులు సైతం ఆశ్చర్యపోతున్నారు. తాజాగా పెచ్చులూడిన ఘటన పై సెక్రటేరియట్ బిల్డింగ్ ఇంజనీర్లపై ఆర్ అండ్ బి ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయం రైలింగ్ పట్టి కూలిపోయి 24 గంటలైనా ఘటనపై అధికారులు నివేదిక ఇవ్వకపోవడంపై సీరియస్ అయ్యారు. 24 గంటల్లోగా తనకు ఈ ఘటన పై పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గతంలోని బిల్డింగ్ లను పూర్తిగా నేలమట్టం చేసి 28 ఎకరాల సువిశాల ప్రాంగణంలో నూతన సచివాలయం భవనాన్ని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. 265 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ బిల్డింగ్ ను దేశంలోని అత్యంత ఎత్తైన సచివాలయ భవనాల్లో ఒకటిగా గుర్తించారు. 2019 జూన్ 27న అప్పటి సీఎం కేసీఆర్ భూమిపూజ చేసి నిర్మాణాన్ని ప్రారంభించగా.. 2023 ఏప్రిల్ 30న ప్రారంభోత్సవం చేశారు. ఈ బిల్డింగ్ నిర్మాణ బాధ్యతల్ని షాపూర్ జీ పల్లోంజీ గ్రూప్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. కాగా.. దీని నిర్మాణం కోసం ఏకంగా రూ.1,200 కోట్లు ఖర్చు చేశారు. ఇంతా చేసిన తర్వాత.. రెండేళ్లు కూడా గడవక ముందే.. బిల్డింగ్ గోడలు చాలా వరకు పగుళ్లు కనిపిస్తున్నాయి. పిల్లర్ల పక్కన పొడవైన చీలికలు కనిపిస్తుండంతో.. బిల్డింగ్ నాణ్యతపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో.. రాష్ట్ర సచివాలయ బిల్డింగ్ నిర్మాణంలో లోపాలు, ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో పూర్తి వివరాలతో రిపోర్ట్ ఇవ్వాలని బిల్డింగ్ ఇంజనీర్లకు ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం మొత్తం పాలన నిర్వహించే నిర్మాణంలో నాణ్యతా లోపాలపై నిర్మాణ సంస్థ షాపూర్ జీ పలోంజి కంపెనీ ప్రతినిధులపై మంత్రి కోమటి రెడ్డి ఆగ్రహం చేశారు. భవనం రెయిలింగ్ కూలిన విషయంలో సంస్థ తరఫున వివరణ ఇచ్చేందుకు సంస్థ ప్రతినిధులు మంత్రిని కలవగా.. కోమటి రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కేంద్ర స్థానమైన భవనాన్నే ఇలా కడితే మిగతా వాటి పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. ఏది ఏమైనా నాణ్యతా లోపాలు ఉంటే.. సదరు సంస్థ చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు.

**లోపాలను సమీక్షిస్తున్నాం**

ఘటనపై షాపూర్ జి పల్లోంజి నిర్మాణ సంస్థ స్పందించింది. రెగ్యులర్ డిపార్ట్‌మెంట్ వర్క్‌లో భాగంగా కేబుల్, లైటింగ్ కోసం పనులు చేస్తున్నారని వివరించింది. ఇది నిర్మాణ లోపం వల్ల జరిగింది కాదని స్పష్టం చేసింది. ఊడి పడింది కాంక్రీట్ వర్క్ కాదు.. స్ట్రక్చర్‌కు ఎలాంటి ప్రాబ్లం లేదని వివరించింది. ఊడి పడింది జీఆర్సీ ఫ్రేమ్ అని నిర్మాణ సంస్థ స్పష్టం చేసిందిఇటీవల లైటింగ్ కోసం, కొత్త కేబుల్స్ కోసం జీఆర్సీ డ్రిల్ చేస్తున్నారని పల్లోంజి సంస్థ వివరించింది. డ్రిల్ చేస్తే జీఆర్సీ డ్యామేజ్ అవుతుందని తెలిపింది. స్ట్రక్చర్ నిర్మాణం పూర్తయి రెండేళ్లు అవుతుందని.. ఎలాంటి నాణ్యత లోపం లేదని వెల్లడించింది. అయినా ఈ ఘటనపై తాను రివ్యూ చేస్తున్నామని.. ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.ఈ సచివాలయాన్ని గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. అయితే.. సచివాలయ నిర్మాణంలో పలు సమస్యలు ఉన్నట్లు ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. సచివాలయం నిర్మాణంలో నాణ్యత లోపాలు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేశారు. తన ఛాంబర్‌తో పాటు టాయ్‌లెట్స్‌లోనూ శబ్ధాలు వస్తున్నాయని.. అప్పట్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులకు చెప్పారు.

# రీ సర్వేతో దిద్దుబాటు చర్యలా...



హైదరాబాద్ : తెలంగాణలో కొద్ది రోజులుగా కుల గణన రచ్చ సాగుతోంది. స్వపక్షం, విపక్షం అన్న తేడా లేకుండా కాంగ్రెస్ సర్కార్‌పై విమర్శలు చెలరేగాయి. బీసీ కుల గణన చేసిన విధానం దేశంలో తెలంగాణ ఆదర్శమవుతుందని సీఎం రేవంత్ రెడ్డి సగర్వంగా ప్రకటించారు. కానీ అందుకు తగ్గట్టుగా కుల గణన జరగలేదని తేలిపోయింది. కేసీఆర్ సర్కార్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేకు, రేవంత్ సర్కార్ చేసిన సర్వేకు మధ్య తేడాలు చర్చాంశనీయంగా మారాయి. 1931లో బ్రిటీష్ పాలకులు చేసిన కుల గణన సర్వే తర్వాత భారత దేశంలో కుల గణన సర్వే జరగలేదు. ఆ గణన ఆధారంగానే దేశంలో రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. 75 సంవత్సరాల తర్వాత బిహార్‌లో 2021లో కుల గణన జరిగింది. అది జరిగిన తీరుపై చాలా విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత గత సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే దేశ వ్యాప్తంగా కుల గణన చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు. అయితే ఎన్డీఏ గవర్నమెంట్ అధికారంలోకి రావడం, తెలంగాణలో బీఆర్ఎస్ ఓడిపోయి, కాంగ్రెస్ అధికారంలోకి రావడం జరిగింది. ఇచ్చిన హమీ మేరకు రేవంత్ ప్రభుత్వం బీసీ కులగణనకు పచ్చ జెండా ఊపింది. సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క సభ్యులుగా మంత్రి వర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 160 కోట్లతో శాస్త్రీయంగా సర్వే నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా కుల గణన సర్వే కోసం 1 లక్షా 3 వేల 889 మంది ఎన్యుమరేటర్లను వినియోగించారు. 1,15, 71, 457 కుటుంబాలను తెలంగాణలో గుర్తించగా ఎన్యుమరేటర్లు 1,12,15,134 కుటుంబాలను సర్వే చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. వివిధ కారణాలతో 3,56,323 కుటుంబాలను సర్వే చేయలేదు. తెలంగాణలో 96.9 శాతం సర్వే కవర్ అయినట్లు 3.1 శాతం సర్వేలో పాల్గొనలేదని ప్రభుత్వం ప్రకటించింది. 2024 నవంబర్ ఆరున సర్వే ప్రారంభించి, 2025 డిసెంబర్ 25వ తేదీతో సర్వేను ముగించారు.

ఈ సర్వేలో తెలంగాణ కులాల శాతం పరిశీలిస్తే..

ఎస్టీల జనాభా శాతం - 10.45

ఎస్సీల జనాభా శాతం - 17.43

మొత్తం ఓసీల జనాభా శాతం - 15.79

ముస్లిం మైనార్టీల జనాభా శాతం - 12.56

ముస్లిం మైనార్టీలలో ఓసీ జనాభా శాతం - 2.48 శాతం

బీసీల జనాభా శాతం - 46.25 శాతం

ముస్లిం మైనార్టీలలో బీసీల శాతం - 10.08 శాతం

ముస్లిం మైనార్టీలు, బీసీలు కలుపుకుని మొత్తం జనాభా శాతం - 56.33

2014 నుంచి పదేళ్లలో అంటే ఈ ఏడాది 2024 వరకు చూస్తే బీసీలు, ఎస్సీ, ముస్లిం జనాభా తగ్గినట్లు, ఓసీ జనాభా మాత్రం పెరిగినట్లు రేవంత్ సర్కార్ చేసిన కుల గణన తేల్చింది. దీనిపై ఆ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కుల గణన సర్వే కాగితాలు తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో బీసీ,ఎస్సీ నేతలు సైతం దీనిపై గుర్రుగా ఉన్నారు. ఓసీ జనాభా మాత్రమే ఎందుకు పెరిగింది , మిగతా సామాజిక వర్గాల జనాభా ఎలా తగ్గుతుంది. ఇదంతా ఓ కుట్ర లా జరిగిందన్న విమర్శలు వచ్చాయి. దీనికి సరైన సమాధానం ఇవ్వలేని పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలది. ఈ కుట్ర కోణం వెనుక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి ఉన్నారన్న చర్చ కాంగ్రెస్‌లో సాగింది. బీసీలకు అవకాశాలు లేకుండా చేసేందుకు ఓ వర్గం వారు కుట్ర పన్నారన్న ఆరోపణలు వచ్చాయి. బీజేపీ నేతలు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కాంగ్రెస్‌ను ఈ విషయంలో టార్గెట్ చేస్తూ తమదైన శైలిలో విమర్శలు గుప్పించారు. ముస్లిం మైనార్టీలకు లబ్ధి చేకూరేలా బీసీ జనాభా తగ్గించి మైనార్టీ సంఖ్య పెంచి చూపించాలని చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభాతో పోల్చుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేయించిన సర్వేలో ఎలా తగ్గిందని ప్రశ్నలు గుప్పించారు. తిరిగి రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై హరీశ్ రావు, కేటీఆర్ ఎందుకు సర్వేలో పాల్గొన లేదని రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు కౌంటర్ ఎటాక్ చేశారు. ఇలా కుల గణన విషయంలో కాంగ్రెస్ సర్కార్ డిఫెన్స్‌లో పడింది. ఇది ఎన్నికల సమయంలో కాంగ్రెస్ గెలిస్తే దేశ వ్యాప్తంగా బీసీ కుల గణన జరిపి తీరతామని రాహుల్ గాంధీ ఇచ్చిన హమీ. ఆ హామీ మేరకు తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు బీసీల జనాభా తగ్గించి చూయించిననట్లు విస్తృత ప్రచారం జరుగుతుండటంతో ఆ వార్త పార్టీ హైకమాండ్ వరకు చేరిందని తెలుస్తోంది. ఆ క్రమంలోనే ఇటు బీసీ కుల గణన రచ్చ, మరోవైపు ఎస్సీ వర్గకరణ విషయంలోను ఎమ్మార్పీఎస్ మందకృష్ణ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రెండు విషయాలు కాంగ్రెస్ పార్టీ కంట్లో నలుసుగా మారాయి. ఈ వివాదాలు నడుస్తుండగానే రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన రద్దు అయింది. అందుకు రాష్ట్రంలోని ఈ పరిస్థితులే కారణమన్న చర్చ హస్తం నేతల్లో నడుస్తోంది. ఇటు ఎస్సీ వర్గీకరణ, అటు బీసీ కుల గణన ద్వారా రాజకీయ లబ్ధి పొందుదామనుకుంటే ఆ వ్యూహం బూమ్ రాంగ్ అయ్యే పరిస్థితి కలిగింది. దీంతో రేవంత్ సర్కార్ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఇటీవలే జరిగిన మందకృష్ణ మాదిగతో రేవంత్ భేటీ అందులో భాగమని తెలుస్తోంది. మరోవైపు బీసీల ఆగ్రహాన్ని చల్చార్చేందుకు మరో దఫా కుల గణన చేపట్టాలని నిర్ణయించింది. ఈ నెల16 నుంచి 28వ తేదీ వరకు మరోమారు కులగణన చేయనున్నారు. అయితే 3.1 శాతం మంది ఈ గణనలో పాల్గొనలేదు. వారి కోసం ఇది చేపడుతున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు.

# కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్ ను నిరసిస్తూ పోరాడాలి

మంథని : దేశంలో సామాన్య ప్రజలపై భారాలను మోపుతూ, కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే మోడీ సర్కార్ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్ను నిరసిస్తూ పోరాడాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సిపెల్లి రవీందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ లు అన్నారు. సిఐటియు,వ్యవసాయ కార్మిక సంఘం,తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర పార్లమెంట్ సమావేశాలలో 2025 ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ మంథనిలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సిపెల్లి రవీందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ లు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అంటూనే రైతు రుణమాఫీ పథకం, ధరల స్థిరీకరణ చట్టానికి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధుల కోత పెట్టి. ఉద్యోగాల భర్తీకి ప్రణాళికలు లేవన్నారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం ఆర్థికంగా సహకరిస్తుందని బాహాటంగా బడ్జెట్లో ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం తప్ప మరొకటి కాదని అన్నారు.కేంద్ర బడ్జెట్లో పారిశ్రామిక రంగానికి రూ.5,300 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయం అన్నారు. 2024-25 బడ్జెట్లో రూ. 5,624 కోట్లు కేటాయించగా ఈసారి రూ.324 కోట్లు భారీ కోత విధించిందని అదే సమయంలో పారిశ్రామికవేత్తల రాయితీల కోసం మాత్రం రూ.13,145 కోట్లుకేటాయించారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు, నవ రత్నాలు, దేశంలో ఉన్న 78 మినీ రత్నాలను ప్రైవేటీకరించడం, అమ్మివేయడం, కార్మిక సంస్కరణలను వేగవంతం చేసే చర్యలు చేపట్టారు. ప్రభుత్వరంగ సంస్థలను, పారిశ్రామిక రంగాన్ని ధ్వంసం చేసేదిగా బడ్జెట్ ఉన్నదన్నారు. తీవ్రమైన నిరుద్యోగం, వేతనాల్లో కోత, ప్రజల్లో కొనుగోలు శక్తి కుచించుకుపోవడం వల్ల ఆర్థిక వ్యవస్థ డిమాండ్ తగ్గిందని దీన్ని పరిష్కరించడానికి బదులు మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు, సంపన్నులకు మరిన్ని రాయితీలిచ్చి ప్రోత్సహించడం దుర్మార్గమైన చర్య అన్నారు. సంపన్నులపై, బడా కార్పొరేట్ శక్తులపై పన్ను విధించాలని, ఉపాధి కల్పనకు నిధులు కేటాయించాలని, కనీస వేతనాలకు గ్యారంటీ ఇచ్చి కార్మికుల, ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నదన్నారు. మరోవైపు ధరలు పెరగడంతో కార్మికుల కొనుగోలు శక్తి మరింత సన్నగిల్లింది.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను రూ.26,000/- లకు పెంచాలని దేశవ్యాప్తంగా కార్మికవర్గం చేస్తున్న డిమాండ్ ను కేంద్ర ప్రభుత్వం బేఖాతరు చేస్తుందని ఈ నేపథ్యంలో 2025-26 ప్రజా, కార్మిక, రైతు,వ్యతిరేక కేంద్ర బడ్జెట్ను రాష్ట్ర కార్మికవర్గం అంతా తీవ్రంగా వ్యతిరేకించాలని, బడ్జెట్ ప్రతిపాదనలను సవరించి కార్మిక, రైతు, ప్రజా అనుకూల బడ్జెట్గా మార్చాలని డిమాండ్ చేశారు.

# డ్రైనేజీ అస్తవ్యస్తం.. రోడ్లపైనే చెత్తాచెదారం!

- భరించలేని దుర్వాసనతో ప్రజల పాట్లు
- సమస్యను పరిష్కరించాలని స్థానికుల డిమాండ్

**వేద న్యూస్, హన్మకొండ చౌరస్తా :**

గ్రేటర్ వరంగల్ నగరంలోని హన్మకొండ బస్టాండ్ సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కాలువలు పూడుకుపోవడంతో మురికి నీటి ప్రవాహం స్తంభించిపోయి రోడ్లపై ఏరులై పారుతోంది. కాలువల్లోని చెత్తాచెదారం చిందరవందరవుతోంది. రోడ్లపై చెత్త పేరుకుపోయి స్థానిక ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. భరించలేని దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ బస్టాండ్ కు వేలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. కానీ మున్సిపల్ అధికారులు కనీసం ఒక చెత్త బుట్ట కూడా ఏర్పాటు చేయకపోవడం



బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, బస్టాండ్ వద్ద చెత్త బుట్టలను ఏర్పాటు చేసి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రోడ్డెక్కుతామని స్థానికులు హెచ్చరించారు.



# ఘనంగా శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



గిరిజనుల ఆరాధ్య దైవం మహావీర్ సద్గురు శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి సందర్భంగా శనివారం మిర్యాలగూడ లోని ఎంపీడీవో కార్యాలయం నుంచి నిర్వహించిన ర్యాలీ లో పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ,తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ,మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్,యువ నాయకుడు స్కైలాబ్ నాయక్‌లతో పాటు గిరిజన నాయకులు, వివిధ సంఘాల నాయకులు అందరూ కలిసి ర్యాలీగా బంజారా భవన్ వరకు చేరుకొని మహా భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో మొట్ట మొదటి సారి పార్టీలకు అతీతంగా గిరిజన సోదరులు అందరూ కలసి ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో ప్రతీ ఒక్కరూ పాడి పంటలతో,సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన గిరిజన సోదరులకు అందరికీ అన్న ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు, గిరిజన ఉద్యోగ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ శ్రీ సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలు

**వేద న్యూస్, హన్మకొండ :**



బంజారాల ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీ సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ములుగు రోడు లోని టీజీ ట్రాన్స్కో సి.ఈ జోనల్ కార్యాలయ ప్రాంగణంలో టీజీ ట్రాన్స్కో ఎస్టి అసోసియేషన్ వరంగల్ జోన్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ సద్గురు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టీజీ ట్రాన్స్కో ఎస్టి అసోసియేషన్ వరంగల్ జోన్ అధ్యక్షుడు వాంకుడోత్.రాజానాయక్ మాట్లాడుతూ బంజారాల్లో సామాజిక,సాంస్కృతిక, ఆధ్యాత్మిక చైతన్యాన్ని, దేశభక్తిని నింపిన మహానీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. వీరుడిగా, సంఘ సంస్కర్తగా, దార్శనికుడిగా, వైతాళికుడిగా ప్రజల హృదయాల్లో సజీవంగా నిలిచిపోయారని అన్నారు.

సేవాలాల్ జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టి అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ అజ్మీర. శ్రీరామ్ నాయక్, సీఈ 400 కే.వి పుల్లయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మోహన్, బోజ్యా, రవికుమార్, తిరుపతి, ప్రసాద్,చంద్రకళ, గిరిజన ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ :**



పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అంకితభావంతో కృషి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతం పెంపుపై ఉప విద్యా శాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల అధికారులు, వార్డెన్లతో మండలాల వారీగా జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో 10వ తరగతి పరీక్షలు చాలా కీలకమని, ఇందులో ఫెయిల్ అయిన విద్యార్థులు చదువు నిలిపి వేసే ప్రమాదం ఉందని, కావున వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఫలితాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్గి ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రతి క్యాటగిరి విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ హెడ్ మాస్టర్ లకు సూచించారు. ఎఫ్ఏ పరీక్షల్లో సీ,డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్నారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారాంతపు పరీక్షలు, రివిజన్ టెస్టులు నిర్వహించాలన్నారు.

ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఉదయం పిల్లలకు రాగి జావ సాయంత్రం వేళల్లో సైతం 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన అల్పాహారం అందించాలని అన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ విజయలక్ష్మి, డీఈఓ జ్ఞానేశ్వర్, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, మండల విద్యా శాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల మరమ్మతులు పూర్తి చేయాలి

**వేద న్యూస్, నెక్కొండ :**



రహదారుల మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం నర్సంపేట నియోజకవర్గం నెక్కొండలో హైబ్రిడ్ వార్షిక నిర్వహణ కింద రోడ్ల భవనాల శాఖ ద్వారా మరమ్మతులు, బలోపేతం అప్ గ్రేడేషన్, రీసర్ఫేసింగ్ చేస్తున్న రహదారులను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ వర్షాకాలం ప్రారంభానికి ముందే రోడ్లపై గుంతలు నింపడం, మరమ్మతులు, నవీకరణ, అత్యవసర పునరుద్ధరణ పనులను వెంటనే చేప ట్టాలన్నారు. ఈ సందర్భంగా వరదల సమ యంలో దెబ్బతిన్న నర్సంపేట నెక్కొండ రోడ్డును నెక్కొండ గూడూరు రోడ్డు, కేసముద్రం రోడ్డుల ను పరిశీలించి మరమ్మత్తులు వెంటనే చేపట్టాల న్నారు. వెంకటాపూర్ గ్రామం సమీపంలో వరదల వల్ల రాకపోకలకు అంతరాయం కలిగిన రెండులో లెవెల్ కాజ్వే లను, రోడ్డు ఆనకట్ట పై వేసిన పైపులైను పరిశీలించి వెంటనే బిటి సర్ఫేసింగ్ చేయాలని ఆదేశించారు.

అదేవిధంగా హనుమకొండ నర్సంపేట మహబూబాబాద్ నర్సంపేట రోడ్డును, పాకాల రోడ్డును కూడా మరమ్మత్తులకు ప్రతిపాదించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా రోడ్ల భవనాల శాఖ డీఈ రమాదేవి, ఏఈ గోపి తదితరులు పాల్గొన్నారు.

# రూ.50 వేలకు మించి ఉంటే ఇక సీజ్!

**వేద న్యూస్, డెస్క్:**

రూ.50 వేలకు మించి డబ్బుతో మీరు ప్రయాణం చేయాల్సి వస్తే అందుకు సంబంధించిన పక్కా ఆధారాలతోనే ప్రయాణించాలి. లేదంటే ఆ డబ్బును సీజ్ చేసే అధికారం ప్రభుత్వ అధికారులకు ఉంటుంది. డబ్బు మాత్రమే కాదు వెండి, బంగారం లాంటి ఆభరణాలు కొనుగోలు చేసినా, ఇతర వస్తువులు కొనుగోలు చేసి పట్టణాల నుంచి గ్రామాలకు తీసుకువస్తున్నా సంబంధిత రసీదులు పక్క ఉండాలి. ఎందుకంటే ఉమ్మడి కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్-నిజామాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆయా జిల్లాల్లో ఎలక్షన్ కోడ్ అమలులో ఉంది. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ప్రజలు డబ్బుతో ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో సరైన పత్రాలు వెంట తీసుకువెళ్లకుంటే ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికలు కావడంతో పెద్దగా హడావుడి లేక కోడ్ అమలులో ఉన్న విషయం చాలా మందికి తెలియడం లేదు. సాధారణ పరిస్థితుల మాదిరిగా ఎక్కువ డబ్బుతో ప్రయాణం చేస్తే అధికారులు పట్టుకుని సీజ్ చేసే అవకాశాలు ఉన్నాయి. పక్కా ఆధారాలతోనే డబ్బును తీసుకువెళ్లాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.



## సమాజ సేవకుడు అమ్మ అశోక్ ఆర్థిక సహాయం

**వేద న్యూస్, శాయంపేట:**

ఇటీవల రైలు ప్రమాదంలో తన రెండు కాళ్లు ఒక చేయి కోల్పోయి నిరుపేద కుటుంబానికి చెందినా కొగిల అరవింద్ హనుమకొండ గార్డియన్ హాస్పిటల్ లోచికిత్సపొందుతున్నాడని తెలుసుకొని కనీసం బెడ్డు చార్జీలు కూడా కట్టలేని పరిస్థితుల్లో ఉన్న అరవింద్ కి సామాజిక సేవకుడు అమ్మ అశోక్ దాతల సహకారంతో సేకరించిన 40000 రూపాయలు గార్డియన్ హాస్పిటల్‌లో తన తల్లిదండ్రులు సుజాత శంకర్‌కి అందించి వారికి మనోధైర్యం చెప్పి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోగిల శరత్ గట్టు నవీన్ మందర రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



## నివాస గుడిసెలు దగ్ధం

**వేద న్యూస్, కామారెడ్డి :**

కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ భూంపల్లి గ్రామంలో రెండు నివాస గుడిసెలు ప్రమాద శాతం దగ్ధం అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సంగయ్యడ రాజశేఖర్ మరియు సంగయ్యడ భాస్కర్ వీరిద్దరి నివాస గుడిసెలు దగ్గునమైనయని సుమారు మూడు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటన పై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ స్పందించి వారికి నివాస గృహాలు కల్పించాలని వారికి నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. నివాస గుడిసెలు పూర్తిగా కాలిపోవడంతో వంటసామాగ్రి బట్టలు వివిధ వస్తువులు పూర్తిగా కాలి బూడిదయింది. ఇకపోతే ఈ ఘటన ప్రమాదవశాతం జరిగిందా లేక ఎవరైనా కావాలనే నిప్పంటించారా అనేది పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయాలి.



## కార్మికులను పరామర్శించిన ఎమ్మెల్యే

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ నియోజకవర్గం లోని దామరచర్ల మండల పరిధిలో వీర్లపాలెం థర్మల్ పవర్ స్టేషన్ నందు వేస్ట్ ట్రీట్మెంట్ ప్లాంట్ లో శుక్రవారం జరిగిన ప్రమాదంలో వేడి బూడిద మీద పడి గాయపడి కార్మికులను హైదారాబాద్ అపోలో ఆస్పత్రిలో శనివారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం బీహెచ్ఈఎల్ వారికి పవర్ మెక్, కాంట్రాక్టర్ సత్యనారాయణకి ఫోన్ చేసి గాయపడిన వారికి కావాల్సిన అన్ని వైద్య సేవలు దగ్గరుండి చూసుకోవాలని అన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## ప్రధాని మోదీని వ్యక్తిగతంగా తిట్టలేదు..!

**వేద న్యూస్, డెస్క్:**

ప్రధాని మోదీని తాను వ్యక్తిగతంగా తిట్టలేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానిని కించపరిచేలా మాట్లాడలేదన్నారు. వ్యక్తిగతంగా, పదవి పరంగా కించపరచలేదని వివరణ ఇచ్చారు. కేవలం మోదీ పుట్టుకతో బీసీ కాదని మాత్రమే అన్నానని, మోదీ పుట్టకతో బీసీ కాదు కాబట్టే బీసీల పట్ల చిత్తశుద్ధి లేదని అన్నానని వివరించారు. తాను చేసిన వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వక్రీకరించారని తెలిపారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణన కూడా చేయాలని సవాల్ విసిరారు. ఢిల్లీలోని టెన్ జన్‌పథ్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మంత్రివర్గ విస్తరణపై రాహుల్ గాంధీతో చర్చించలేదని చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు తెస్తామన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటామని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణపై కమిషన్ అధ్యయనం చేస్తోందని సీఎం వివరణ ఇచ్చారు. కులగణన, ఎస్సీ వర్గీకరణలో రాజకీయ జోక్యం లేదన్నారు.

## బొడ్రాయి ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

**వేద న్యూస్, స్టేషన్ ఘనపూర్ :**

జఫర్ గడ్ మండలం హిమ్మత్ నగర్ గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బొడ్రాయి అనేది గ్రామ దేవతలకు ప్రతినిధి అని, ఊరి భౌగోళిక పరిమాణం, ఊరి నిర్మాణం పైన ప్రజలందరికి అవగాహన కల్పించడం కోసమే ఈ పండుగ చేస్తారని తెలిపారు. ప్రతీ ఒక్కరు దైవ చింతనను కలిగి ఉండటం వలన మానసిక ప్రశాంతత చేకూరుతుందని వెల్లడించారు. ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073